# ముందు చూపు

కోలపల్లి ఈశ్వర్



మేరీ సహేలీ సౌజన్యంతో

**"నన్నా దేవుడు సర్వకాల సకలావస్థల యందూ నా వెంటే ఉండి కాపాడుతూ ఉంటాడు సుప్పూ! ఇందాక నీ గురించి ఆలోచిస్తూ ఇక్కడి కొస్తుంటే వెనకనుంచి ఓ స్కూటర్ స్పీడుగా వచ్చి నన్ను గుద్దేయబోయింది. లక్కీగా ఓ వ్యక్తి నన్ను పక్కకి లాగేయబట్టి సరిపోయింది గానీ లేకుంటే ఈ పాటికి నేను కీ.శే. సుకుమార్‌నైపోయి వుండేవాణ్ణే!"**

"నిర్ఘుంగానా?!!" సుకుమార్ కేసి ఆందోళనగా చూస్తూ అంది సుప్రియ.

"నిజం సుప్పూ! అసలిప్పుడనే కాదు. ఎప్పుడూ దేవుడు నన్నలాగే కాపాడుతుంటాడు. నేనొట్టి భక్తిపరుణ్ణి కాదుగానీ, మా అమ్మ ఐ మీన్ నీ కాబోయే అత్తగారు చాలా భక్తిపరురాలు!! ఎప్పుడూ పూజలూ, వ్రతాలూ చేస్తూనే ఉంటుంది. వారానికి మూడ్రోజులు ఉపవాసముంటుంది. అందుకేనేమో ఆ దేవుడు నా మీద ఇలా ప్రత్యేకాభిమానాన్ని చూపిస్తుంటాడు! సర్వకాల సకలావస్థలయందు నా వెంటే వుంటూ ఆ దేవుడు నన్నింతవరకూ ఎన్నెన్ని ఆపదల నుంచి గట్టెక్కించాడో తెలుసా? చెప్పుకుపోవాలంటే అది చాలా పెద్ద లిస్టే అవుతుంది. అసలు ఆపదలప్పుడనే కాదు అన్ని విషయాల్లోనూ ఆ దేవుడు నాకు ఫేవర్ చేస్తుంటాడు. అంతెందుకూ? నేనొక సాదా సీదా మనిషిని చేస్తున్నది అతి చిన్న ఉద్యోగం. పెద్ద హాండ్సమ్‌గా కూడా ఉండను. పోనీ ఆస్తిపరుణ్ణా అంటే అదీ కాదు. అలాంటి నాకు నీలాంటి అపురూప సౌందర్యరాశి హృదయంలో చోటు దొరికింది అంటే అది దేవుడి కృపకాక మరేంటీ?!" ప్రేయసి అందాన్ని పొగుడుతూ పరవశంగా అన్నాడు సుకుమార్.

మామూలుగా అయితే "ప్రేమకి అందచందాలతోనూ, ఆస్తిపాస్తులతోను పనేముంది సుకుమార్! అది రెండు హృదయాల పవిత్ర కలయిక" లాంటి నవలా డైలాగేదైనా వాడుండేదే సుప్రియ.

కానీ - అన్యమనస్కంగా ఉండటం వల్ల ఇప్పుడలాంటి డైలాగేదీ వాడలేక పోయిందామె.

"అదేంటలా ఉన్నావ్?" ఆమె మాట్లాడకపోవడం చూసి కాస్త గాబరాగా అడిగాడు సుకుమార్.

"ఎలా ఉన్నాను? మామూలుగానే ఉన్నాగా?"

"ఊహూ. నీ ముఖంలో రోజూ ఉండే కళ లేదివ్వాళ. దేని గురించో సీరియస్‌గా ఆలోచిస్తున్నట్టున్నావు..."

"ఏం లేదు కుమార్! నా మనసెందుకో బాగోలేదివ్వాళ..." అస్పష్టంగా గొణిగింది సుప్రియ. "మనం ఇవ్వాల్టికింక వెళ్ళిపోదాం"

"అప్పుడేనా?!! వచ్చిందిప్పుడేగా?!!" అయిష్టంగా ముఖం పెట్టి అన్నాడు సుకుమార్.

"చెప్పాగా మనసు బాగోలేదని..." నసిగింది సుప్రియ.

"కారణం..?!!" కళ్ళలోంచి టన్నులకొద్దీ ఆవేదనని కురిపిస్తూ అడిగాడు.

"దయచేసి నన్నిపుడేమీ అడగొద్దు..." తలదించేసుకుంటూ అంది.

"అదేంటి సుప్పూ? నా దగ్గర కూడా దాపరికమా?... నాతో కూడా చెప్పుకోలేని విషయాలుంటాయా నీకు? మనసుల్ని పంచుకున్నాం. ముమ్ముందు జీవితాన్ని కూడా పంచుకోబోతున్నాం. అలాంటిది నాతో కాకపోతే ఇంకెవరితో చెబుతావు? ప్లీజ్ సుప్పూ... చెప్పు నీ బాధేమిటో...?!!" లాలనగా అడిగాడు సుకుమార్.

"ప్లీజ్ కుమార్! ప్రస్తుతానికి నన్నేం విసిగించొద్దు"

అతను ఊహించని విధంగా ఆమె దిగ్గున లేచి నిలబడింది.

"సుప్పూ సుప్పూ" అంటూ సుకుమార్ కూడా లేచి నిలబడ్డాడు.

"నన్నాపొద్దు. ప్లీజ్ వెళ్ళనీ" అంటూ ముందుకు సాగిపోయింది సుప్రియ.

"దేవా! నువ్ పక్కనే ఉండికూడా ఇలా చేస్తున్నావేంటి? నా ప్రేయసికి కోపం రప్పించావేంటి? అసలు నేనేవన్నానని" మనసులో బాధగా అనుకుంటూ తనూ ముందుకుదిలాడు సుకుమార్.

❋ ❋ ❋

ఆ పార్కులో పల్లీలమ్మే పన్నెండేళ్ళ ప్రసాద్ 'ప్చ్... ఈ రోజు అయిదు రూపాయల బేరం తప్పిపోయింది' అనుకున్నాడు మనసులో బాధగా.

❋ ❋ ❋

రూమ్‌లో ప్రవేశించగానే తన సూట్‌కేస్ దగ్గరికెళ్ళి సుకుమార్ అడపాదడపా తనకి రాసిన ఉత్తరాల కట్టని బయటకు తీసింది సుప్రియ.

ఒక్కో ఉత్తరాన్నీ ఆమె పరపరా చించి పారేస్తుంటే... ఆ దృశ్యం చూసి గాబరా పడింది విమల.

ఆ వర్కింగ్ విమెన్స్ హాస్టల్లో వాళ్ళిద్దరూ గత రెండేళ్ళుగా కలిసి ఉంటున్నారు. పైగా ఒకే గదిలో.

"ఏంటే అది? మీ సుకుమార్ రాసిన ఉత్తరాలా? ఎందుకలా చించేస్తున్నావ్? మీ మధ్య ఏమైనా అభిప్రాయభేదాలొచ్చాయా?" అడిగిందామె మంచం దిగి స్నేహితురాల్ని సమీపిస్తూ.

"గొడవలేం రాలేదు గానీ..." నసిగింది సుప్రియ.

## పెళ్ళి దానికోసమేగా!

"ఓ పెళ్ళి కానీ ఐ.ఎ.ఎస్ అధికారితో సంబంధముందంటూ మీ పత్రికలవాళ్ళు ఏవేవో రాస్తున్నారు. అసలు ఆయనెవరో నాకు తెలియదు. ఇద్దరు ముగ్గురు అధికారుల భార్యలతో నాకు స్నేహ సంబంధాలున్నాయి. అంతమాత్రాన మీయిష్టమొచ్చినట్లు రాస్తారా? ఆయనతో నా పెళ్ళి కూడా నిశ్చయమైనట్లు రాశారు. ఇప్పుడు నా మనసంతా నా కూతురు రీనా భవిష్యత్తు గురించే!పెళ్ళి చేసుకునేది సంతానం కోసమేగా! అది నేను పెళ్ళి కాకుండానే పొందాను. ఇక నాకు పెళ్ళెందుకు చెప్పండి?" అంటూ ఓ ఫంక్షన్లో తన సమీపాని కొచ్చిన విలేఖర్లను ఎడాపెడా తిట్టేసి వెళ్ళిపోయింది సుస్మితాసేన్. అందుకే అంటారు ఉన్నది చెబితే ఉలుకెక్కువని.



"మరైతే ఎందుకీ చింపుడు కార్యక్రమం?!!"

"ఇవ్వాళ్టి నుంచి నేనతన్ని మర్చిపోవాలనుకుంటున్నాను."

"ఎందుకే?!!... అసలేం జరిగింది?!!"

చెప్పింది సుప్రియ – పార్కులో తనకీ, తన ప్రియుడికీ మధ్య జరిగిన సంభాషణ అంతా.

"దానికీ, నీ ఈ హఠాత్ నిర్ణయానికీ సంబంధం ఏమిటే?!!" సంగతేంటో బోధపడక బుర్రగోకుంది విమల.

"జీవితంలో శృంగారానికి చాలా ఇంపార్టెన్స్ ఉందే..."

"అయితే?" అసందర్భంగా ఉన్న ఆ స్టేట్‌మెంట్‌కి బుర్రగోకుకోవడాన్ని రెట్టింపు చేసింది విమల.

"అనుభవం అంటూ లేకపోయినా శృంగారం పట్ల నాకు చాలా అవగాహనా ఆసక్తీ ఉన్నాయ్..."

"ఉంటే?!" బుర్రగోరుడ్నీసారి త్రిగుణీకృతం చేసింది విమల.

"దేవుడు సర్వకాల సకలావస్థలయందూ అతని వెంటే ఉంటాడట. ఇలాగైతే రేప్పొద్దున్న బెడ్ రూమ్‌లో ప్రోబ్లం కదా?! వేరొకరు మనల్ని చూస్తున్నారన్న ఫీలింగ్ ఏర్పడితే 'సెక్స్'ని సరిగ్గా ఎంజాయ్ చెయ్యలేం. అందుకే నేనీ నిర్ణ...."

ఆమె మాటింకా పూర్తికాక ముందే "దభ్" మన్న శబ్దం వినిపించింది.

ఉన్నపళంగా ఒక మనిషి స్పృహతప్పి పడిపోతే అలాంటి శబ్దం రావటం సహజమే కదా!

❋




